వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 301 శుక్రవారం | 14 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



## ఆప్యాయత, అనురాగాల వేదిక..

హంటర్ రోడ్ లోని సీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ శుక్రవారం మంత్రులు కొండా సురేఖ, సీతక్కల మధ్య నెలకొన్న ఆప్యాయత, అనురాగాలకు వేదికగా నిలిచింది. సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి సోదరుడు వేం పురుషోత్తం రెడ్డి సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన వీరు ఒకరినొకరు ఆప్యాయతతో పలకరించుకొని హృద్యంగా మాట్లాడుకుంటున్న దృశ్యాలు కాంగ్రెస్ పార్టీ అభిమానులకు కన్నుల పండువగా నిలిచాయి. ఇద్దరు మహిళా మంత్రుల మధ్య విభేదాలంటూ అవాకులు చెవాకులు పేలిన నోళ్ళకు ఈ దృశ్యాలు సమాధానంగా నిలిచాయి.

-వరంగల్ వాయిస్, వరంగల్






## రెండో రోజు.. అదే జోరూ

ఉత్సాహంగా సాగుతున్న జర్నలిస్టుల క్రీడలు

ప్రారంభిస్తున్న ప్రముఖులు

క్రీడా స్ఫూర్తిని చాటుతున్న పాత్రికేయులు




8లో..



# ప్రజారోగ్యం.. ప్రశ్నార్థకం?



వివరాలు 2లో..

### ఊసేలేని ఆహార తనిఖీలు


జాడలేని ఫుడ్ సేఫ్టీ అధికారులు

విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న రెస్టారెంట్లు, దాబాలు, బేకరీలు

ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై నియంత్రణ కరువు

నిబంధనలు పాటించని వ్యాపారులు

భోజన ప్రియుల అభిరుచులనే వ్యాపార మార్గాలుగా మలుచుకొని పలువురు హోటల్ రంగంవైపు మొగ్గు చూపుతున్నారు. కానీ వ్యాపార నిర్వాహకులు ఎంతవరకు నియమ నిబంధనలు పాటిస్తున్నారన్న ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది. ఇందులో సరఫరా చేస్తున్న ఆహారం సురక్షితమా? కాదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనిని తేల్చాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు జాడలేకపోవడంతో రెస్టారెంట్లు, దాబాల యజమానులు ఆడింది ఆట పాడింది పాటగా మారింది. కుటుంబంతో కలిసి రెస్టారెంట్లకు వెళితే పసందైన వంటకాలను రుచులు దేవుడెరుగు జేబు గుల్లా కావడంతోపాటు రోగాలను కొని తెచ్చుకోవాల్సి వస్తుందంటూ భోజన ప్రియులు ఆరోపిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, వరంగల్ పట్టణాల్లోని ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు నిర్వహించిన అధికారులు కాలం చెల్లిన పదార్థాలు, బూజు పట్టిన చికెన్ వాడుతున్నట్లు తేల్చి చెప్పారు. ఇదే పరిస్థితి మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు తొర్రూర్, మరిపెడ పట్టణాల్లోనూ నెలకొన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై కూడా నియంత్రణ కరువైందంటున్నారు. - వరంగల్ వాయిస్, మరిపెడ




2లో

## బదిలీలు, పదోన్నతుల్లో అయోమయం

గందరగోళంలో ఉపాధ్యాయులు

అర్ధరాత్రి వరకు నెట్ సెంటర్లలోనే పడిగాపులు

# ప్రజారోగ్యం.. ప్రశ్నార్థకం?



## ఊసేలేని ఆహార తనిఖీలు

### జాడలేని ఫుడ్ సేఫ్టీ అధికారులు

### విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న రెస్టారెంట్లు, దాబాలు

### బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై నియంత్రణ కరువు

### నిబంధనలు పాటించని వ్యాపారులు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** పుట్టిన రోజు, పెండ్లి రోజు, వీకెండ్ ఏదైనా రెస్టారెంట్ కు పోవాల్సిందే..తృప్తిగా భోజనం చేయాల్సిందే అన్న అభిప్రాయం ఇప్పుడు అందరిలో వ్యక్తమవుతోంది. నలుగురు దోస్తులు కలిసినా రెస్టారెంట్ కు వెళ్లాల్సిందే. అయితే భోజన ప్రియుల అభిరుచులనే వ్యాపారంగా మలుచుకొని ఇష్టాతిరీతిగా డబ్బులు వసూలు చేస్తూ పెద్దమొత్తంలో లాభాలు అర్జిస్తున్న వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను మాత్రం పాటించడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మనం పసందుగా ఆరగిస్తున్న ఆహారం సురక్షితమా? కాదా? అన్నది అనుమానంగా మారుతోంది. దీనిని పరిశీలించి నిజానిజాలు తేల్చాల్సిన అధికారులు నిద్రమత్తు వీడడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పుట్టగొడుగుల్లా రెస్టారెంట్లు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు తొర్రూర్, మరిపెడ పట్టణాలు, మండల కేంద్రాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న రెస్టారెంట్లు, హెూటళ్లు, దాబాలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అనేక ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే దాబాలు, రెస్టారెంట్లు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. ఆహర స్వచ్ఛత, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్నది పర్యవేక్షించాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉన్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. వీటిపై నియంత్రణ కరువు కావడంతో యాజమాన్యాలు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలున్నాయి.

### జేబు గుల్లా..

కుటుంబంతో కలిసి హెూటల్స్, రెస్టారెంట్లకు వెళ్లి పసందైన వంటకాలను రుచులను ఆరగించడం ప్రస్తుత కాలంలో ప్రజలకు అలువాటుగా మారింది. పట్టణాల్లో అధిక జనం వీకెండ్ వచ్చిన, లేదంటే నలుగురు మిత్రులు కలిసినపుడు దాబాల్లో, రెస్టారెంట్లకు వెళ్లి భోజనాలు ఆరగిస్తుంటారు. అయితే వీటిల్లో తింటున్న ఆహారంతో జేబు గుల్లా కావడంతో అనేక రోగాలను డబ్బులు పెట్టి కొనుక్కోవాల్సి వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. అలాంటి దాబా హెూటల్స్, రెస్టారెంట్లలో వంటల కోసం ఎలాంటి నూనెలు వాడుతున్నారు. అలాగే ఎలాంటి మాంసమును వినియోగిస్తున్నారు. ఆరోగ్యకరమైన మాంసమే వాడుతున్నారా.. ఇలాంటి వాటిపై దృష్టి సారించి రెస్టారెంట్లలో ప్రజలకు నాణ్యమైన ఆహారం అందుతుందా అనే అంశంపై ఆహారం నాణ్యత పరీక్షల కోసం ల్యాబ్ కు పంపాల్సి ఉంటుంది. ఈ అం శంపై సంబంధిత శాఖా అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శలు జోరందుకున్నాయి. రెస్టారెంట్ల యజమానులు నియమాలు పాటించక పోవడంతో ప్రజలు వ్యాధులకు గురవుతున్నట్లు వైద్య నిపుణులు ఎన్నోసార్లు చెబుతునే ఉన్నారు.



### నాణ్యత లోపిస్తే ఆరోగ్యం హరి?


ఆహార పదార్థాల కొనుగోళ్లకు ఉన్న డిమాండ్ గ్రహించిను కొందరు స్థానికులు, ఇతర రాష్ట్రాల వారు కూడా రెస్టారెంట్లను ఏర్పాటు చేయడంలో పోటీ పడుతున్నారు. వీటిల్లో కొన్నింట నాసి రకం తినుబండారాలు విక్రయిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్ని నెలల క్రితం మహబూబాబాద్, తొర్రుర్ లోని ఓ హెూటల్ లో భోజనంలో పురుగులు వచ్చాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మరిపెడ పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ హెూటల్ లో సమోసా తిన్న ఏడుగురు అస్వస్థతకు గురయ్యారు. బేకరీల్లో, సూపర్ మార్కెట్ లలో, కిరాణా షాపుల్లో కాలం ముగిసిన పదార్థాలనే విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్, కట్లెట్ పానీపూరి బండ్లలో రుచికి మించి హానికర పదార్థాలు వాడుతున్నారు. వాటి వల్ల కలరా, డయేరియా వ్యాధుల బారిన పడుతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కొన్ని చోట్ల బజ్జీ బండ్లలో మాడిననూనెలోనే తిరిగి బజ్జిలు వేసి మరిగిస్తున్నారు. వాటిని భుజించిన వారు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోకుండా ఎక్కడ పడితే అక్కడ దొరికింది ఆరగిస్తే రోగాలు చుట్టు ముట్టడం ఖాయం అని హెచ్చరిస్తున్నారు. మరి తినేవారు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందా..? అమ్మేవారి సంగ తేంటి..? హెూటల్స్, రెస్టారెంట్లపై ఆశాఖ అజమామాయిషి కనపడటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెూటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు తనిఖీ చేసే అధికారుల జాడే లేదని మండిపడుతున్నారు. దీంతో ఫుడ్ సేఫ్టీ శాఖ ఉందన్న సంగతే మహబూబాబాద్ జిల్లా ప్రజలు మర్చిపోయారు. నిత్యం ఆహార తనిఖీల నాణ్యతను పరిరక్షించే ఫుడ్ ఇన్ స్పెక్టర్ మచ్చుకైనా కాణరావడంలేదు. అయితే వారు ఆమ్యామ్యాలకు అలవాటు పడి వీటివైపు కన్నెత్తి కూడా చూడడంలేదన్న ఆరోపణలున్నాయి. ఇలాంటి ఆహారం తీసుకుంటున్న వారి ఆరోగ్యం రోజు రోజుకు ప్రమాదంలో పడి పోతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# బదిలీలు, పదోన్నతుల్లో అయోమయం

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా కొనసాగించాలనుకుంటున్న టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పలు విమర్శకు తావిచ్చింది. ఎన్నో ఏండ్లుగా బదిలీ, పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న పండితులకు అనేక అవరోధాలు, అవమానాలు జరిగాయి. గత ఎమ్మెల్సీలు ఓట్ల కోసం భాషా పండితులను పావులుగా వాడుకున్నారు. పదోన్నతులు ఇప్పిస్తామనే ఆశచూపి పండిత సంఘ నాయకులను చేరదీసి వారి ద్వారా లబ్ధి పొంది గెలిచిన తర్వాత వారిని పూర్తిగా విస్మరించారు. అయితే ఎన్నో ఇబ్బందులకు గురైన పండితులకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వారి పదోన్నతుల్లో కొంత కదలిక వచ్చింది. పండితుల్లో కొందరు తమ సమస్యను పరిష్కరించుకునేందుకు కోర్టు మెట్లు కూడా ఎక్కారు.

### టెన్షన్..టెన్షన్..

భాషా పండితులకే స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం పేర్కొనడంతో సమస్యకు పరిష్కారం లభించింది. కానీ ప్రభుత్వం ఇచ్చిన పదోన్నతుల షెడ్యూల్ లో హడావుడి జరిగింది. తొలత వెబ్ ఆప్షన్ ప్రక్రియ ఈ నెల 13 నుంచి 16 వరకు అంటూ షెడ్యూల్ ప్రకటించి స్కూల్ లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కానీ విద్యాశాఖాధికారులు మాత్రం కేవలం 13వ తేదీ రాత్రి 3గంటలు మాత్రమే పండితులకు వెబ్ ఆప్షన్ ఇవ్వాలంటూ హడావుడి చేసారు. దీంతో రాత్రి వర్షంలో తడుస్తూ ఉపాధ్యాయులు నెట్ సెంటర్లకు చేరకొని టెన్షన్ వాతావరంలో ఇబ్బందులు పడ్డారు. ఏకకాలంలో ఎంతో మంది సైట్ ఓపెన్ చేయడంతో సైట్ నెమ్మదిగా నడిచింది. రాత్రి ఓంటి గంట వరకు వెబ్ ఆప్షన్ ఇవ్వడం జరిగింది. ఎంతో మంది ఉపాధ్యాయులు వారి యొక్క ఎంప్లాయ్ ఐడీతో ఫోన్ కు ఓటీపీ రాకపోవడం, మరి కొందరికి వెబ్ ఆప్షన్ తీసుకోకపోవడంతో టీచర్లు రాత్రి మొత్తం జాగారం చేశారు. ఈ సమస్యకు కారణమైన అధికారుల అవగాహన రాహిత్యం ఇక్కడ కొట్టించినట్లుగా కనబడింది. పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులే కాకుండా సోషల్, బయోసైన్స్ టీచర్లకు అవకాశం ఇచ్చారు. అనేక వ్యాయ ప్రయాసలు పడుతూ వెబ్ ఆప్షన్ నమోదు చేసిన వారికి తిరిగి ఉదయం సవరిస్తామని ఓసారి, మళ్లీ అవకాశం ఉంటుందని మరోసారి... చివరకు వెబ్ ఆప్షన్ రిమూవ్



చేసినట్టుగా వార్తలు రావడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కోందరూ ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లకుండానే సెలవులో ఉండగా, మరికొందరూ పాఠశాలలకు వెళ్లి రిలీవ్ కావాలని ఉదయం స్కూలకు చేరుకున్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రక్రియ అధికారుల అలసత్వం, అవగాహన రాహిత్యం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా ఉందని ఉపాధ్యాయ లోకం పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రభుత్వ బడులను కాపాడాలని టీచర్లు కోరుతున్నారు. అయితే వివిధ జిల్లాల్లో ఆల్రెడీ ఆప్షన్స్ ఇచ్చిన వారు కూడా రిజర్వేషన్ రోస్టర్ దృష్ట్యా మళ్ళీ చేయాల్సిన అవసరం ఉందని సమాచారం..



## మంత్రి సురేఖను కలిసిన మధు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసిన నీలం మధు శుక్రవారం అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను హనుమకొండ రాంనగర్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పథకాలు జనాలకు చేరువవుతున్న తీరు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై ఇరువురు చర్చించారు.

## పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, కరీంబాద్ :** నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రంగశాయిపేటలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూలు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చందన పూర్ణచందర్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు ఈ సంవత్సరం బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ కు ఎంపికైన చరిత, వర్ష, రాష్ట్ర స్థాయి ఖో- ఖో క్రీడలో సిల్వర్ మెడల్ సాధించిన నవ్యశ్రీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ సూర్యకళ, సీనియర్ ఉపాధ్యాయులు కుమారస్వామి, సంధ్య శ్రీ, లావణ్య, సుహాసిని, సుజాత, రాములు, సునీత, ఉమారాణి, అనిత, శ్రీవాణి, కళావతి సాంబయ్య, దేవేందర్ రెడ్డి, పీఈటి గోగు నారాయణ, వనమాచారి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నోట్ పుస్తకాలు అందజేత



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండల కేంద్రంలోని గాలివారి గూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నారెడ్డి కవిత-సుదర్శన్ రెడ్డి తమ సొంత ఖర్చులతో విద్యార్థులందరికీ సుమారు రూ.5000 విలువైన నోట్ పుస్తకాలు, పలకలు, బలపాలు, పెన్నులు, పెన్సిళు పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా దాత నారెడ్డి కవిత మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మురళీధర్, వెంకన్న, ఫైజుద్దీన్, బాలు, లింగాల మహేష్ గౌడ్, అంగన్వాడీ టీచర్లు రాములమ్మ, అచ్చమ్మ, అనిత, గ్రామస్తులు వెంకన్న, సునీత లాలయ్య పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లె అంబేద్కర్ కాలనీ ఆర్ బీఎస్కే పరకాల టీం హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి వచ్చి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. పుట్టినప్పటి నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్న పిల్లలకు సీజనల్ వ్యాధులు, వారికి వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. పుట్టుకతో కలిగే అంగవైకల్యాలు, పోషకాహార లోపంతో కలిగే ఇబ్బందులను తగ్గించుటకు సూచనలు చేశారు. అంగన్వాడీ సెంటర్లలో లభించే బాలామృతం, పాలు, గుడ్లు, ఆహారాన్ని చిన్న పిల్లలు తీసుకుంటూ అంగన్వాడీ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రంలో భోజనం చేసి, ఎగ్గు తిని, పాలు గి సరైన పోషణతో ఉండే ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనివ్వాలని తెలియజేశారు. చిన్నపిల్లలకు ప్రతినెల టీకాలను తప్పకుండా వేయించాలని, వ్యాధి నిరోధకతను పెంచుకోవాలన్నారు. ఈ వైద్య బృందంలో డాక్టర్ రవీందర్, డాక్టర్ సంధ్యారాణి, కవిత, ఏఎన్ఎం బోసు బాబు, ఫార్మసిస్ట్ అంగన్వాడీ టీచర్స్ కోడెపాక సుప్రియ, ఆయా జన్ను వనజ, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

# చేగువేరా స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సామ్రాజ్యవాదుల గుండెల్లో దడ పుట్టించిన విప్లవ ధృవతార చేగువేరా అని, ఆయన ఉద్యమ పోరాట స్ఫూర్తితో నేటి విద్య, ఉపాధి, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్, బాషబోయిన సంతోష్ అన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో చేగువేరా 96వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ 1928 జూన్ 14న అర్జెంటీనాలో జన్మించిన చేగువేరా వైద్య, ఇంజినీరింగ్ విద్యలను అభ్యసించి ఆనాటి కాలంలో లాటిన్, అమెరికా సామ్రాజ్య వాదం ప్రజలపై చేస్తున్న దుశ్చర్యలకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన వీరుడని, క్యూబా స్వాతంత్ర్య ఉద్యమంలో కాస్ట్రో తో పాల్గొని ఆ దేశానికి స్వాతంత్ర్య రావడంలో ముఖ్య పాత్ర పోషించి ఆ దేశానికి మంత్రి అయ్యారని తెలిపారు. బొలివియా దేశ స్వాతంత్ర్య కోసం క్యూబాలో మంత్రి పదవిని త్యాగం చేసి, అమెరికా సామ్రాజ్యంపై అసమాన పోరాటం చేశారని కొనియాడారు. చేగువేరా ఉద్యమ పోరాట పటిమకు భయపడిన అమెరికా సామ్రాజ్యవాదులు దొంగ దెబ్బతో 1967 అక్టోబర్ 9న చంపడం జరిగిందని తెలిపారు. చనిపోయిన చేగువేరా మృతదేహం దగ్గరకు వెళ్లి చూడడానికి అమెరికా సైన్యానికి చెమటలు పడ్డాయని, చే చనిపోయి కూడా అమెరికాను ఒకరోజు పాటు భయపెట్టాడని, అంతటి పోరాట చరిత్ర కలిగిన మహోన్నత వ్యక్తి చేగువేరా అని తెలిపారు. అసమానతలు లేని సమాజం కోసం పోరాడిన విప్లవ వీరుడు చేగువేరా అని, ఆ ఉద్యమ కారుని పోరాట స్ఫూర్తితో విద్య వ్యతిరేక విధానాలపై, దేశంలో ఉన్న అసమానతలపై, అకలి లేని, పేదరికం లేని, అత్యాచారాలు లేని సమాజం కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు కుంటి పవన్, శ్రీపతి వినయ్, రాజు, రమేష్, అనిల్, సునీల్ లు పాల్గొన్నారు..

## రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవండి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** రక్తదానం చేసినప్పుడు దాతల నుంచి సేకరించిన రక్తం వారి శరీరంలో తిరిగి కేవలం 21 రోజులలో పునరుత్పత్తి అవుతుందని, రక్తదానం చేయటం వల్ల శరీరంలో ఉన్న చెడు కొలెస్ట్రాల్ తగ్గి ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారని 18 సంవత్సరాల నుంచి ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిస్సందేహంగా రక్తదానం చేయవచ్చునని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ రక్త దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఎంజీఎం ఆసుపత్రిలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతినిత్యం రక్తం ఎంతో అవసరమన్నారు. అలాగే, ప్రమాదాలలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి కూడా దాతలు దానం చేసే రక్తం ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంవత్సరంలో కనీసం రెండుసార్లైనా రక్తదానం చేయాలని, రక్తం అమూల్యమైనదని కృత్రిమంగా తయారు చేయలేని ఈ రక్తం జీవించి ఉండగా మనిషి చేసే దానాలలో గొప్ప దానం అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్వచ్ఛంద రక్తదాతలకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య




**వరంగల్ వాయిస్, కరీంబాద్ :** బాల్య దశలోనే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లయితే విద్యతో పాటు క్రమశిక్షణ కలిగి ఉంటారని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. రేఖ అధ్యక్షతన జరిగిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ మరుపల్ల రవి హాజరై పిల్లలకు పలక, బలపం ఇచ్చి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. బీద విద్యార్థుల ప్రయోజనం కోసం ఎన్నో కోట్ల రూపాయలను ప్రభుత్వం వెచ్చించి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం సమకూర్చున్నందున ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని, రాబోవు రోజుల్లో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీ చైర్మన్ ఈ. రాజేశ్వరి, కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్.మాధవి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆర్.రేఖ, టీచర్లు పి.వీరాచారి, డి.రఘు, జి.వెంకటేశ్వర్లు, కే.శ్రీనివాస్, కే.చక్రపాణి, జె.వీరేంద్ర ప్రసాద్, ఏ శారదా దేవి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు తరాల రాజమణి ఉన్నారు.

# రక్తదానంపై అవగాహన ర్యాలీ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో "రక్తదాతలకు వందనాలు" చేస్తూ రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భూజేందర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో మిన్న అని, రక్తదానంతో ప్రత్యక్షంగా ఒక ప్రాణాన్ని కాపాడచ్చున్నారు. తద్వారా మనకు కూడా సంతోషం, నూతన ఉత్సాహం కలుగుతుందని తెలిపారు. కాబట్టి, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. అలాగే, లైవ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన 18 నుంచి 60 సంవత్సరాల వయసు గలవారు రక్తదానం చేయడానికి అర్హులని, ఇది ఉత్పత్తి అయ్యే వస్తువు కాదని, వలంటరీగా రక్తదానం చేస్తేనే ఇతర ప్రాణాలు కాపాడ బడుతాయని రక్తదానంపై ఎన్నో అపోహలు ఉన్నాయని రక్తదానంతో నేను వీక్ అయితానని నా ఆరోగ్యం ఖరాబుతోందని అనేది అపోహ మాత్రమే కానీ మన బాడీలో ఒక ఆఫ్ లీటర్ 500ఎంఎల్ రక్తం సర్ ప్లేస్ గా ఉంటుందని, అందులో నుంచి మనం 300 ఎంఎల్ రక్తం మాత్రమే ఇస్తామని కాబట్టి, ఎవరు రక్తదానం చేసి భయపడద్దన్నారు. దీనివల్ల మనకు కొత్త రక్తం వచ్చి చాలా ఉత్సాహంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ సంజీవ, డాక్టర్ అనిత, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ బి.గోపి, సీనియర్ వలంటీర్లు ప్రవీణ్, రామ్ చరణ్, ఫయాజ్, రవళి, వలంటీర్లు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

## డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీధర్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీధర్ వైద్య సిబ్బందికి సూచించారు. మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వయోజన బీసీజీ వాక్సిన్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు మాసంలో 18 సంవత్సరాలు పై బడిన వారికి క్షయ వ్యాధిని అంతం చేయడం కోసం 3 నెలల పాటు వాక్సిన్ వేసే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ టీకా కోసం ప్రతి ఆశ, ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని కోరారు. ఈ వయోజన బీసీజీ వాక్సిన్ తీసుకోవడానికి అర్హత ప్రమాణాలు ముఖ్యం గా 60 ఏళ్లు పై బడిన వృద్ధులు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువగా ఉన్నవారు, స్వీయ -నివేధిత షుగర్ వ్యాధిగ్రస్తులు, ప్రస్తుతం, గతంలో పొగతాగుట, జనవరి 2021 నుంచి క్రియాశీల టీబీ వ్యాధిగ్రస్తులతో సన్నిహిత సంబంధం, గత 5 సంవత్సరాలలో టీబీ వ్యాధి సోకిన చరిత్ర కల వారికి ఈ టీకా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి, ప్రసాద్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వనాకర్ రెడ్డి, కమ్యూనిటీ మెడికల్ ఆఫీసర్ శాంత కుమారి, సూపర్ వైజర్ సుదర్శన్, వెంకటేశ్వర్లు, శోభారాణి, పల్లె దవాఖాన డాక్టర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## రేపు 'ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ప్రోగ్రాం' ముగింపు

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ భౌతిక శాస్త్రం, ఇంగ్లీష్, రసాయన శాస్త్రం, గణిత శాస్త్ర అధ్యాపకులకు నిర్వహిస్తున్న 3 వారాల "ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ప్రోగ్రాం" ముగింపు కార్యక్రమం రేపు మధ్యాహ్నం విశ్వవిద్యాలయ గణిత శాస్త్ర విభాగ సెమినార్ హాల్ లో నిర్వహిస్తునట్లు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, ముగింపు కార్యక్రమ అధ్యక్షుడు ఆచార్య బి.సురేష్ లాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా వైస్ ఛాన్సలర్ ఇంచార్జ్ వాకాటి కరుణ, ఐ.ఎ.ఎస్ హాజరు అవుతునారు అని, అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, రసాయన శాస్త్ర విభాగ అధిపతి ఆచార్య టి.సవితా జ్యోత్స్న, ఇంగ్లీష్ విభాగ అధిపతి డాక్టర్ బి.దీపా జ్యోతి, ఫిజిక్స్ విభాగ అధిపతి డాక్టర్ జి.మంజుల, గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ ఆర్. భారవి శర్మ హాజరవుతారని అయన తెలిపారు.

## వేం పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి నివాళి



**వరంగల్ వాయిస్, నడికూడ :** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి సోదరుడు వేం పురుషోత్తం రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ ,కౌన్సిలర్ మడకొండ సంపత్ కుమార్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పర్నెం తిరుపతిరెడ్డి, రంజాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ అర్షం రాజ్ కుమార్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీనియర్ జర్నలిస్ట్, నమస్తే తెలంగాణ క్రైం రిపోర్టర్ అర్షం రాజ్ కుమార్ కు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ సన్మానం చేశారు. రాజ్ కుమార్ 18 సార్లు రక్త దానం చేశారు. గురువారం ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని సుబేదారి రెడ్ క్రాస్ భవనంలో రక్త దాతలు కలెక్టర్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ కు కలెక్టర్ సన్మానం చేసి మెమోంటో అందజేసి అభినందిచారు.

## యువత రక్తదానానికి ముందుకు రావాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలు నిలుస్తాయని, అందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఐటీ మాస్టర్ వారి ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని ఐటీ మాస్టర్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ లో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానంపై యువత గ్రామాలల్లో ప్రజలకు అవగాహన పెంచి రక్తదానం చేసేందుకు ప్రతీ ఒక్కరినీ ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో రక్తం కొరత లేకుండా చూడాలన్నారు. అనంతరం ఐటీ మాస్టర్ కంప్యూటర్ విద్యార్థులు ఎమ్మెల్యేతో ఫొటోలు దిగారు.

## కార్మిక నాయకులకు కలెక్టర్ అభినందనలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హనుమకొండ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కార్మిక నేతలను హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అభినందించారు. అనేక ఏళ్లుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లి రక్తదానం చేసిన ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ సీనియర్ నాయకుడు కుర్సపల్లి రవీందర్‌తో పాటు, ఇప్పటికీ సుమారు 48సార్లు రక్తదానం చేసిన ఎస్సీఆర్ఎంయూ సికింద్రాబాద్ డివిజనల్ మాజీ అధ్యక్షుడు, కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏఐఆర్ఆర్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ర యాదవరెడ్డి, అనేకమార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఆలిండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొడ్డున వెంకటేశ్వర్లు, రక్తదాన శిబిరాల నిర్వహణ కీలక పాత్ర పోషించిన ప్రసాద్, శ్రీనివాస్‌లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, పెద్ది వెంకటనారాయణ, పొట్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ విప్లవ పోరాటానికి చిరునామా చేగువేరా

### ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ విప్లవ పోరాటానికి చిరునామా చేగువేరా అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్ అన్నారు. శుక్రవారం శివనగర్ ఎస్సీ బాయ్స్ హాస్టల్ లో చేగువేరా 96 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ చేగువేరా పేరు వింటే సామ్రాజ్యవాదులకు వెన్నులో వణుకు పుడుతుందన్నారు. చే బొమ్మ కంటిలో కనిపిస్తే నరాల్లో నెత్తురు విద్యుత్ ప్రవహిస్తుందని తెలిపారు. విప్లవానికి ఎల్లలు లేవని, కులం, భాష, ప్రాంతం, మతం తెలియదన్నారు. విప్లవం సమస్త మానవాళి సామూహిక స్వప్నం అని నిరూపించిన మహోన్నతమైన మానవుడు చేగువేరా అని కొనియాడారు. వీరమరణం పొంది ఎన్నో రోజులైనా జనం గుండెల్లో స్ఫూర్తిని రగిలిస్తూనే ఉన్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మొటం శివ కుమార్, సంతోష, మేకల అభిరామ్, ప్రభాస్, రాజు, సాయి పాల్గొన్నారు.

## రక్త దాతలకు సన్మానం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** రక్త దాతల దినోత్సవం సందర్భంగా వరంగల్ రామన్నపేటలోని డాక్టర్.ఏ .రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మేనేజింగ్ ట్రష్టి మాట్లాడుతూ ప్రపంచంలో ఏ వస్తువునైనా తయారు చేయవచ్చు కానీ, రక్తాన్ని తయారు చేయడం అనేది జరగదన్నారు. కేవలం భగవంతుడు మనకి ఇచ్చిన మానవజన్మలో భాగంగా రక్తాన్ని శరీరంలో పొందుపరచడం జరిగింది. కేవలం మానవులు మాత్రమే రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది రోగులను, అతి క్లిష్ట పరిస్థితిలో ఉన్నఎంతో మంది ప్రాణాన్ని కాపాడడం జరిగిందని తెలిపారు. వీరికి ఎస్ కే ముస్తఫా పదిసార్లు, అల్వాల పృథ్వీరాజ్ 15 సార్లు రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ తరపున అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, కోఆర్డినేటర్ మోహన్, వారణాసి, ప్రకాష్, సరళ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించండి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ప్రభుత్వ బడిలో చేర్పించండి.. ఊరిబడిని కాపాడండి అని మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తొర్రూరు ఎంపీడీవో సిలార్ సాహెబ్ అన్నారు. అనంతరం ఆయన నూతన విద్యార్థుల చేత అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల శాశ్వత విద్యా దాత కీ.శే:మొగుళ్ల వెంకటేశ్వర్లు కుమారులైన మొగుళ్ల అఖిల్, ఆకాష్ సోదరులు విద్యార్థులకు అందించిన పలకలు, బలపాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మండల సూపరింటెండెంట్ గోపాల్, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ రేణుక, ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, గ్రామ కార్యదర్శి సీహెచ్ సుమన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎస్.మాధవి, వీఓఏ రజిత, పలు మహిళా సంఘాల ప్రతినిధులు కవిత, స్వప్న, సహ ఉపాధ్యాయురాలు హారికతో పాటుగా, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

## నిషేధిత గడ్డి మందు పట్టివేత



**వరంగల్ వాయిస్, మరిపెడ :** పట్టణ కేంద్రంలో నిషేధిత గడ్డి మందును స్వాధీనం చేసుకున్నట్లు మరిపెడ వ్యవసాయ అధికారి వీరాసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం టాస్క్ ఫోర్స్ ఎన్ ఫోర్స్ మెంట్ తనిఖీలో భాగంగా మరిపెడ మండలంలో సూర్యతేజ ఏజెన్సీస్, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో బిల్లు లేకుండా అమ్ముతున్న గ్లైపోసెట్ గడ్డి 22లీటర్ల మందును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.10వేల వరకు ఉటుందన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం 'విద్యుత్ ప్రజావాణి'

### టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట :** టీజీఎన్పీడీసీఎల్‌లోని విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులను తీసుకొని వాటిని సకాలంలో పరిష్కరించేందుకు ప్రతి సోమవారం "విద్యుత్ ప్రజావాణి" నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి టీజీఎన్పీడీసీఎల్ 16 సర్కిళ్ల పరిధిలోని అన్ని ముఖ్య కార్యాలయాల్లో అనగా సర్కిల్ ఆఫీస్, డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్ లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్ లలో "ప్రతి సోమవారం "ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, సర్కిల్ ఆఫీస్ లో అదే రోజు సమయం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని పటిష్ట పరిచడంలో భాగంగా సమీక్షలు నిర్వహించి విద్యుత్ వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. టీజీ ఎన్పీడీసీఎల్ లోని ఎన్పీడీసీఎల్ పోర్టల్, కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్ లకు అనుసంధానిస్తూ 'విద్యుత్ ప్రజావాణి" అని మరొక పోర్టల్ ను ఏర్పాటు చేసి వినియోగదారులకు మరింత చేరువలో ఉద్యోగస్తులు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కార వేదికగా "విద్యుత్ ప్రజావాణి "నిలుస్తుందని సీఎండీ అన్నారు .

## వేం పురుషోత్తం రెడ్డికి మంత్రుల నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హంటర్ రోడ్డు సీఎస్ఆర్ గార్డెన్‌లో సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి సోదరుడు వేం పురుషోత్తం రెడ్డి సంవత్సరీక కార్యక్రమానికి హాజరై వారి చిత్ర పటం వద్ద మంత్రులు దనసరి సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, చైర్మన్లతో తో పాటు తదితరులు ఉన్నారు.



# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### టీఎన్జీఓస్ కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి ముజీబ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** టీఎన్జీఓస్ యూనియన్ కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా నేడు నూతనంగా ఎన్నికైన ముజీబ్, కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ లను హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం నాంపల్లి టీఎన్జీఓస్ భవన్ లో టీఎన్జీఓస్ బాధ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ నూతనంగా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ముజీబ్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ నాయకత్వంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని వారికి హనుమకొండ జిల్లా ఉద్యోగులు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొంటూ వారికి అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన ముజీబ్ మాట్లాడుతూ ఉద్యోగులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఉద్యోగ సంఘాల నేతలకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేశ్ ,కేంద్ర సంఘ నాయకులు శ్యామ్ సుందర్, కత్తి రమేష్, సారంగపాణి, మోయిజ్, లక్ష్మి ప్రసాద్, జిల్లా నేతలు ఆకుల రాజమౌళి, రామ్ ప్రసాద్, రాజీవ్, అనూప్, పైడిరాజు, ప్రణయ్, పృథ్వీ, రామాంజనేయులు, నవీన్, సుధాకర్, మెహబూబ్, మిస్బా తదితరులు ముజీబ్ కు అభినందనలు తెలియజేశారు.

## ప్లాస్టిక్ స్థానంలో బయో డీగ్రేడబుల్ పాలిమర్లను వాడాలి



**వరంగల్ వాయిస్, కేయూ :** ప్లాస్టిక్ స్థానంలో బయో డీగ్రేడబుల్ పాలిమర్లను వాడాలని హైదరాబాద్, నేషనల్ ఇన్ స్టిట్యూట్ అఫ్ ఫార్మాస్యుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐపీఈఆర్) పూర్వపు రిజిస్ట్రార్, కాకతీయ విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యుడు సీహెచ్. సంజీవ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ సెమినర్ హాల్ లో విభాగ అధిపతి ఆచార్య టి సవితా జ్యోత్స్న సారథ్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుల 3 వారాల ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో "ఇంపార్టెన్స్ అఫ్ పాలిమర్స్" అనే అంశంపై విస్తృత ఉపన్యాసం చేశారు. ముఖ్యంగా పాలిమర్‌లను బయోడిగ్రేడబుల్ పాలిమర్‌లుగా మార్చడం, పరిశ్రమ, గృహావసరాలలో ఉపయోగించే వివిధ వర్గాల పాలిమర్ల స్థానంలో బయోడిగ్రేడబుల్ వినియోగం వివరించారు. పాలిమర్‌లతో తయారైన ఉత్పత్తులు మన చుట్టూ ఉన్నాయని, వీటిలో సింథటిక్ ఫైబర్‌లు, పాలిథిలిన్ కప్పులు, ఫైబర్ గ్లాస్, నైలాన్ బేరింగ్‌లు, ప్లాస్టిక్ బ్యాగులు, పాలిమర్ ఆధారిత పెయింట్‌లు, జిగురు, ఫోమ్ కుషన్, టెఫ్లాన్-కోటెడ్ వంటసామాను, దుస్తులు ఉన్నాయని అన్నారు. వీటి స్థానంలో బయోడిగ్రేడబుల్ దారాలు, పేపర్ కప్ లు, జూట్ లేదా బట్టతో చేసిన సంచులు, ప్రకృతి సంబంధిత రంగులు, ఇతర వంట పాత్రలు వాడకం పెరగాలన్నారు. దీనిపై ప్రజల్లో చాలా చైతన్యం, అవగాహన అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానంతో మరొకరి ప్రాణాలు కాపాడొచ్చు

### కలెక్టర్ సిక్తా పట్నాయక్



**వరంగల్ వాయిస్, పరకాల :** రెడ్ క్రాస్ భవన్, ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ భవన్ లో రెడ్ క్రాస్ పాలకవర్గం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు సిక్తా పట్నాయక్ హాజరయ్యారు. కలెక్టర్ ముందుగా రెడ్ క్రాస్ సొసైటీలోని తలసేమియా సెంటర్ ను సందర్శించి పిల్లలతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. తలసేమియా బాధితులకు పండ్లు పంపిణి చేశారు. తలసీమియా వ్యాధిగ్రస్తులకు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలకు పాలకవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు సిక్తా పట్నాయక్, పాలకవర్గం ప్రపంచ రక్త దాత దినోత్సవం పురస్కరించుకొని కార్ల్ ల్యాండ్ స్టినేర్ (ఫాదర్ ఆఫ్ బ్లడ్ డోనర్స్ ) చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురలు సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ రక్తకేంద్రం, తలసేమియా సెంటర్, జనరిక్ మెడికల్ షాప్ నిర్వహణలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో ఉందని, కరోనా కాలంలో, వరదలు వచ్చినప్పుడు బాధితులకు నిత్యావసర సరుకులు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ఆదుకున్నారని, అత్యవసర సమయంలో రెడ్ క్రాస్ సేవలు ముందుంటాయి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ మానవ శరీరంలోని రక్తం గ్రూపులను కనుగొన్నది కార్ల్ ల్యాండ్ స్టీనర్, అయన 14 జూన్ 1868 జన్మించారని, అయన జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచ రక్త దాత దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ మాట్లాడుతూ బ్లడ్ డొనేషన్ గొప్ప కార్యక్రమని, అర్హత గల ప్రతి ఒక్కరూ రక్త దానం చేసి తలసేమియా బాధితుల ప్రాణాలను కాపాడే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. పాలకవర్గ సభ్యులు, ప్రోగ్రాం కన్వీనర్ పొట్లపల్లి శ్రీనివాస్ రావు స్వాగత ఉపన్యాసం మాట్లాడుతూ మానవజన్మను సార్థకం చేసుకోవాలంటే మనలో నిరంతరం ఉత్పత్తి గల రక్తాన్ని దానం చేయడమే గొప్ప సేవ అని అన్నారు. పాలకవర్గ సభ్యులు మరియు కార్యక్రమం కోకన్వీనర్ పుల్లూరు వేణు గోపాల్ మాట్లాడుతూ రక్త దాతలు ప్రాణదాతలని పేర్కొంటూ ప్రాణాపాయంలో ఉన్నవారికి వారిచ్చే రక్తం ఎంతో అవసరం పడుతుందని పేర్కొంటు రక్తదాతలను మరియు రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఆర్గనైజర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్, రక్తదాతలకు, రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఆర్గనైజర్లకు ధన్యవాదములు తెలియజేశారు. అనంతరం సమాజంలో రక్తదాతలను మోటివేట్ చేసి రక్తదాన శిబిరాలను నిర్వహించే వారికి, ఉత్తమ రక్త దాతలుగా ఎంపికైన వారికి కలెక్టర్, పాలకవర్గం చేతులమీదుగా ప్రశంసా పత్రం, షీల్డ్, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ను పాలకవర్గం షీల్డ్, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు: పుల్లూరు వేణు గోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ సీహెచ్. సంధ్యారాణి, బాశెట్టి హరిప్రసాద్, రక్తదాతలు, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఆర్గనైజర్స్, రెడ్ క్రాస్ సిబ్బంది శివ కుమార్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

# స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భాషా పండితులకే.!

### తేల్చి చెప్పిన దేశ అత్యున్నత న్యాయ స్థానం

### సుప్రీం కోర్టుకు ధన్యవాదాలు తెలిసిన భాషా పండితులు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** గత 20 ఏళ్లుగా ఎస్జీటీల క్రాస్ ప్రమోషన్ వల్ల తీవ్రంగా నష్టపోయిన భాషా పండితులు స్కూల్ అసిస్టెంట్లు భాష భాషాపండితులకు మాత్రమే కెటాయించాలని సుదీర్గ పోరాటం చేశారు. ఎస్జీటీలు తమకు ఆడ్డు వచ్చి స్కూల్ అసిస్టెంట్ (గ్రెడ్ వన్) పోస్ట్ అందుకుంటున్నారని పండిట్ల్ న్యాయ స్తానం ఆశ్రయించగా 2004 సంవత్సరంలో న్యాయ స్థానం తీర్పు ఇచ్చినప్పటికీ ఎస్జీటీలు తమకు కూడా ప్రమోషన్ ఇవ్వాలని కోర్ట్ కు వెళ్లారు. దీంతో విచారించిన రాష్ట్ర హైకోర్టు పండితుల పోస్టులు పండితులకే ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. మళ్లీ ఈ తీర్పును కూడా సవాల్ చేస్తూ ఎస్జీటీలు సుప్రీం కోర్టుకు వెళ్లారు. దీనిపై కూడా విచారించిన దేశ అత్యున్నత ధర్మాసనం సుప్రీం కోర్డు ఎస్జీటీలు వేసిన కేసును శుక్రవారం కొట్టివేయడం జరిగింది. ఈ తీర్పు చారిత్రాత్మమైనది, గత రెండు దశాబ్దాలుగా నలుగుతున్నపండితుల సమస్యను రాష్ట్రీయ ఉపాధ్యాయ పరిషత్, తెలంగాణ రాష్ట్రం అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, నరసింహులుతో పాటు సంఘం తరఫున ఏర్పాటు చేసుకున్న సుప్రీం కోర్టు లాయర్ సురేంద్రరావు, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన సమస్య పరిష్కారం తమ భుజాస్కాందాలపై వేసుకోని, ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో, సమయస్ఫూర్తితో 10479 పండిత్, పీఈటి పోస్టులను అప్ గ్రేడ్ చేయించారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘనతను సాధించిన రాష్ట్ర శాఖకు యావత్తు పండితలోకం జీవితాంతం రుణ పడి ఉంటుందని మానుకోట పండిత్ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు మడిపెల్లి రమేష్, కొలిపాక శ్రీనివాస్ తెలిపారు.

# ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితంగా పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్డీఓలు కృష్ణవేణి, సిదం దత్తు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పరిష్కరించాలని అన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ అధికారి, తహసిల్దార్ల స్థాయిలలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణతో పరిష్కరిస్తామని, పెండింగ్ దరఖాస్తులు సత్వర పరిష్కారానికి జిల్లాలోని మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించి దరఖాస్తుల పరిష్కారం వేగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, మండల తహసీల్దారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి..

నిబంధనల మేరకు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి డిసిపి రవీందర్ తో కలసి పశు సంవర్ధక, మున్సిపల్, పంచాయతీ, పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 17 న బక్రీద్‌కు వెటర్నరీ అధికారులు ధ్రువీకరరించిన జంతువులను మాత్రమే వినియోగించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక అధికారి బాలకృష్ణ, జెడ్పి సీఈఓ రామి రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్లు జోనా, శ్రీనివాస్, పోలీస్, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ పదవికై గంజి శ్రీనివాస్ నేత సీఎం వినతి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** త్వరలో నియమించబోయే తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేషన్ చైర్మన్ గా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ టీపీసీసీ వీవర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్ నేత సీఎం రేవంత్ రెడ్డిని, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, దీపా దాస్ మున్షీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. 1995 నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేశానని సీఎంకు ఈ సందర్భంగా వివరించారు. 30 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ రాజకీయం. పార్టీ పరంగా తనపై 37 కేసులు బనాయించారు, రాజకీయ ప్రత్యర్థుల బనాయింపు కేసుల వల్ల 20 ఏళ్ల వయసులో చేయని తప్పుకు సెంట్రల్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. అంతేకాకుండా 1999లో అప్పటి ప్రభుత్వంలో మా పార్టీ వారి 6 ఇళ్ళను తగలబెట్టారు. వాటిలో రెండు ఇల్లు మా సొంతం. కోర్టు వాయిదాల గురించి తిరిగి రాజకీయంగా నలిగిపోయాం, నష్టపోయాం. ఆఖరికి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవించాము. గతంలో ఎన్నో ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశానని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ మల్లు రవి గెలుపు కోసం కృషి చేశానని తెలిపారు. తాను ప్రస్తుతం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఉంటున్నానని, ఆ ప్రాంతంలో సైతం కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు కృషి చేస్తువస్తునన్నారు. త్వరలో నియమించబోయే కార్పొరేషన్ చైర్మన్ల పదవిలో తనను పరిగణలోకి తీసుకొని అవకాశం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇంచార్జి దీపా దాస్ మున్షీలను, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను, టీపీసీసీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని గంజి శ్రీనివాస్ నేత తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో.. ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల మృతి





**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున బస్సు కోసం ఎదురుచూస్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెలితే మహబూబాబాద్ నుంచి నర్సంపేట వైపుకు జామాయిల్ కర్ర లోడుతో వెళు న్న లారీ అదుపుతప్పి గూడూరు బస్టాండ్ సెంటర్ లో బీభత్సం సృష్టించి బోల్తా పడింది. దీంతో అక్కడే ఉన్న సీఐ గన్ మెన్ మండలంలోని కొంగర గిద్ద గ్రామానికి చెందిన ధనసరి పాపారావు, మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దేవందర్ పై జామాయిల్ కర్రలు ఒక్కసారిగా పడడంతో వారికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. బోల్తా పడిన లారీని లేపడానికి స్థానిక పోలీసులు, బాటసారులు నానా అవస్థలు పడ్డారు. వీరు ఇద్దరు కొద్దిసేపట్లో వారి వారి విధుల్లోకి హాజరయ్యే లోపే ఒక్కసారిగా మృత్యువాత పడడంతో ఆ ప్రాంతం మృతుల బంధువులు, సన్నిహితులతో శోకసముద్రంగా మారింది. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న జిల్లా ఎస్పీ రాం నాథన్ కేకన్‌సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికి తీసిన అనంతరం గూడూరు మార్చురికి తరలించారు. లారీ డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదనికి కారణం అయి ఉండొచ్చని స్థానికులు చర్చించు కుంటున్నారు. పోలీసుకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





# ప్రజల సమస్యలపై పోరాట గళం కల్లూరి పవన్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లస్కర్ సింగారానికి చెందిన కల్లూరి పవన్ ప్రజల సమస్యలపై పోరాట గళంగా ముందుంటున్నారు. బీటెక్ పూర్తి చేసి సమాజానికి ఉపయోగ పడాలని, ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఎలాంటి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ లేకున్నా నిరు పేద కుటుంబం నుంచి వచ్చి 15 ఏళ్లుగా ప్రజల పక్షాన పోరాడుతున్నారు. ప్రజల సమస్యల కోసం కోట్లడుతూ ఆ సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నాడు. కరోనా సమయంలో ప్రతి ఒకరికి తన వంతుగా సహాయం అందించాడు. సమస్య ఉందంటే వారి పక్షాన ముందు ఉంటాడు. బీసీల సమస్యల పై హనుమకొండ జిల్లాలోనే కాదు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ సమస్య ఉన్న స్పందించే వ్యక్తి పవన్. అనేక కేసు లు, ముందస్తూ అరెస్ట్ లు, బైండోవర్లను తట్టుకొని ముందుకు వెళుతున్నారు. ఈ పార్టీ ఆ పార్టీ అని కాదు అందరితో మంచిగా ఉంటూ ఎవరితో ఏ సమస్య పరిస్కారం అవుతుంతో వాళ్లతో ఆ సమస్యను పరిష్కరించే నేర్పరి. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అడుగు జాడల్లో నడుస్తున్నారు. ఇలాంటి స్వార్ధం లేని నాయకులకు మంచి అవకాశం వస్తే రాబోయే రోజుల్లో మరింత సేవ చేసే అవకాశం ఉంటుందని ప్రజలు అనుకుంటున్నారు.

# మళ్లీ షూటింగ్‌లకు రెడీ అవుతున్న బాలయ్య




ఎన్నికల హడావుడి ముగియడంతో మళ్లీ సినిమాలపై దృష్టి సారించేందుకు నందమూరి బాలకృష్ణ సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఇప్పటికే కొంత భాగం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ నెలాఖరు నుంచి పునఃప్రారంభం కానుందని సమాచారం. హైదరాబాద్‌లో సిద్ధం చేసిన ప్రత్యేక సెట్‌లో ఈ కొత్త షెడ్యూల్ మొదలు కానుందని తెలిసింది. దీనిలో భాగంగా బాలయ్యపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలయ్య రెండు కోణాలున్న పాత్రలో కనిపించనున్నారు. ఇందులో ఆయనకు జోడీగా శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఊర్వశీ రౌతేలా, చాందినీ చౌదరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.




# చిరు విశ్వంభరలో బాలీవుడ్ స్టార్ కునాల్ కపూర్


అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధానపాత్రలో వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర' తాజాగా మరో కొత్త సమాచారంతో అభిమానుల్లో జోష్ పెంచింది. ఇందులో ఓ బాలీవుడ్ నటుడు పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు తెలిపింది. బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ 'విశ్వంభర' టీమ్‌లో జాయిన్ అయినట్లు తెలుపుతూ దర్శకుడు పోస్ట్ పెట్టారు. ఇందులో కునాల్ విలన్‌గా కనిపించనున్నారంటూ కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ హీరోపై పోస్ట్ పెట్టిన నిర్మాణ సంస్థ.. ఆయన ఏ పాత్రలో కనిపించనున్నారనే విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచింది. ఇందులో కునాల్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని.. ఆయన విలన్ అని తెలిసే ట్విస్ట్ సినిమాకే హైలైట్ అని టాక్. ఇప్పటికే ఈ బీటౌన్ హీరోపై కొన్ని కీలకమైన సన్నివేశాలను కూడా చిత్రీకరించినట్లు సమాచారం. ప్రస్తుతం 'విశ్వంభర' షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో కునాల్ కూడా పాల్గొంటున్నారు. జులై చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలనే లక్ష్యంతో శరవేగంగా షూట్ చేస్తున్నారు. ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్‌పై చిత్రబృందం ప్రత్యేక దృష్టి పెట్టనుంది. రూ.200కోట్లతో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా 'విశ్వంభర' రూపొందుతోంది. ఇప్పటి వరకు చూడని పాత్రలో చిరు కనిపించనున్నారు. భారీ స్థాయిలో యాక్షన్ సీక్వెన్స్‌లు ఉండనున్నాయి. ఇక ఈ చిత్రంలో ఐదుగురు హీరోయిన్లు ఉండనున్నట్లు ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌లో స్టార్ హీరోయిన్స్ త్రిష, ఆషికా అధికారికంగా జాయిన్ అయ్యారు. సురభి, ఇషా చావ్లా, మీనాక్షి చౌదరి పేర్లను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.




# కొత్తదనం లేని కథ..



సుబ్రహ్మణ్యం (సుధీర్ బాబు) ఒక పోలీటెక్నిక్ కాలేజ్ లో ల్యాబ్ అసిస్టెంట్ గా పని చేస్తూ ఉంటాడు. కుప్పం వూర్లో తమ్మిరెడ్డి (లక్కీ లక్ష్మణ్), అతని సోదరుడు (రవి కాలే), ఇంకా శరత్ (అర్జున్ గౌడ) తమ బలగంతో ప్రజల భూములు కాజేసి, తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వుంటారు. అడ్డువచ్చిన వాళ్ళని నరుకుతూ తమకి ఎదురులేదు అనే విధంగా వుంటారు. ఒకరోజు తమ్మిరెడ్డి మనుషులు ఒక యువకుడిని వెంటాడుతూ చంపడానికి ప్రయత్నం చేస్తూ ఉంటే సుబ్రహ్మణ్యం అడ్డుపడతాడు, తన వుద్యోగం పోగొట్టుకుంటాడు. అదే కాలేజ్ లో పని చేస్తున్న టీచర్ (మాళవిక శర్మ) తో ప్రేమలో ఉంటాడు సుబ్రహ్మణ్యం. తన తండ్రి చేసిన అప్పులు తీర్చటం కోసం డబ్బులు గడించాలని, సస్పెండ్ అయిన పోలీసు కానిస్టేబుల్ పళని (సునీల్) తో చేతులు కలిపి ఖాళీగా వున్న ఒక సినిమా థియేటర్ లో గన్స్ తయారు చేసి అవి దొంగచాటుగా అమ్మడం మొదలుపెడతాడు. తన తండ్రిని తమ్మిరెడ్డి మనుషులు కట్టి తీసుకువచ్చి చంపటానికి ప్రయత్నం చేస్తుంటే, సుబ్రహ్మణ్యం వాళ్ళని అడ్డుకుంటాడు, తండ్రిని కాపాడుకుంటాడు. సుబ్రహ్మణ్యం పేరు కుప్పంలో మారుమోగుతోంది, ప్రజలు అతన్ని దేవుడిగా చూస్తూ వుంటారు. రెడ్డి మనుషులు ఎందుకు తన తండ్రిని చంపాలని అనుకుంటారు? దొంగతనంగా గన్స్ ఎక్కడ నుండి తయారవుతున్నాయో తెలుసుకోవడానికి వచ్చిన స్పెషల్ పోలీసు ఆఫీసరు (అక్షర గౌడ) ఏమి కనుక్కుంది? రెడ్డి సోదరులకు, సుధీర్ బాబు కి మధ్య యుద్ధం ఎలా, ఎప్పుడు మొదలయిందనేదే 'హరోం హర' సినిమా స్టోరీ. దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో వచ్చిన ఈ 'హరోం హర' అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' సినిమాకి దగ్గరగా ఉంటుంది. అందులో గంధంచెక్కల దొంగతనంగా అమ్ముతూ, డబ్బులు గడిస్తూ పుష్ప పెద్దవాడైతే, ఇందులో గన్స్ తయారుచేస్తూ వాటిని దొంగతనంగా అమ్ముతూ పెద్దవాడవుతాడు సుబ్రహ్మణ్యం. ఆ సినిమా కూడా చిత్తూరు, తిరుపతి నేపథ్యం అయితే, ఈ సినిమా చిత్తూరు జిల్లాలో కుప్పం నేపథ్యంలో వచ్చిన సినిమా. దానికితోడు గన్స్ తయారుచేస్తూ, దొంగతనంగా అమ్ముతూ, అడ్డువచ్చిన విలన్స్ చంపుకుంటూ పోయే సుబ్రమణ్యాన్ని దేవుడుగా చిత్రీకరిస్తాడు దర్శకుడు. అలాగే సుబ్రహ్మణ్యం తను కాబోయే భార్యకి గన్స్ అమ్మి డబ్బు గడిస్తున్నాను అంటే అది ఆమె సమర్థించటమే కాకుండా, అది చాల మంచిది అన్నట్టుగా చెప్పించాడు దర్శకుడు. 'కేజీఎఫ్' సినిమా కూడా దర్శకుడిపై బాగా ప్రభావం చూపించినట్టుంది, అందుకని ఆ సినిమా ఛాయలు కూడా ఈ 'హరోం హర' లో కనిపిస్తాయి. 'హరోం హర' సినిమా మొదలవడం ఆసక్తికరంగానే సాగుతుంది, కానీ తరువాత కొన్ని సాగదీత సన్నివేశాలతో నింపేసాడు దర్శకుడు. విలన్ మనుషులతో సుధీర్ బాబు తలపడే సన్నివేశం నుండి కథ కొంచెం వేగం పుంజుకుంటుంది. అయితే దర్శకుడు మొదటి సగం వరకు సినిమాని బాగానే చూపించగలిగాడు. కానీ రెండో సగంలో కథ ఏమి చెయ్యాలో తెలియక, ఎక్కువగా పోరాట సన్నివేశాలపై దృష్టి మరల్చాడు. అలాగే కొన్ని సన్నివేశాలు సాగదీసాడు కూడా. చేతిలో పదిరూపాయలు కూడా లేని కథానాయకుడు ఒక్కసారిగా ధనవంతుడు అవటం అనేది ఎన్ని సినిమాల్లో చూడలేదు మనం ఇప్పటివరకు. అందుకని దర్శకుడు ఇందులో కొత్త పాయింట్ ఏమీ చెప్పలేదు, అదే కథలని తిప్పి తిప్పి తీసాడు, కొంచెం కుప్పం యాస పెట్టాడు అంతే. దర్శకుడు కేవలం సుధీర్ బాబుని ఒక మాస్ అవతార్ లో చూపించాలని ఈ కథని రాసినట్టుగా కనపడుతోంది. ఈ సినిమాలో హింస మరీ ఎక్కువయింది, తలలు నరకటం, మొండాలు చూపించడం తగ్గిస్తే బాగుండేది. ఇప్పుడు చాలా సినిమాల్లో అదొక ఫ్యాషన్ అయిపోయింది.ఇక నటీనటుల విషయానికి వస్తే సుధీర్ బాబు ఒక మాస్ అవతార్ లో కనపడతారు, అతని బాడీ, అతని ఫిజిక్ చూపించడానికి ఈ సినిమా ఉపయోగపడింది. పోరాట సన్నివేశాల్లో బాగున్నారు, అతని పాత్రని సంఘర్షణలతో కూడి బలంగా రాసి ఉంటే బాగుండేది. కథలో కొత్తదనం లేదు, ఏమి జరుగుతుందో ముందే ఊహించుకోవచ్చు.







# రెండో రోజు.. అదే జోరూ



**ఉత్సాహంగా సాగుతున్న జర్నలిస్టుల క్రీడలు**

**ప్రారంభిస్తున్న ప్రముఖులు**

**క్రీడా స్ఫూర్తిని చాటుతున్న పాత్రికేయులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జర్నలిస్టుల క్రీడలు రెండో రోజు కూడా ఉత్సాహంగా సాగాయి. క్రికెట్, వాలీబాల్, క్యారం, చెస్ పోటీల్లో వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం ఏడు గంటలకే హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. వీటిని కాజీపేట ఏసీపీ పుప్పాల తిరుమల్ ప్రారంభించారు. తొలుల క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఆయన టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఆయన బ్యాట్ పట్టి షాట్స్ కొడుతుంటే క్రీడాకారుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన క్యారమ్, చెస్ పోటీలను మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ధాస్యం వినయ్ భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులతో కలిసి వినయ్ భాస్కర్ కొద్దిసేపు క్యారం ఆడారు. హెూరాహెూరీగా సాగిన వాలీబాల్ పోటీల్లో గుంటి విద్యాసాగర్ జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, అల్లం రాజేశ్ వర్మ, బూర్ల నరేందర్, ఆరెల్లి కిరణ్, సోమ్ నర్సయ్య, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాశ్, డెస్క్ ఇంచార్జి గోలి రవి, ప్రెస్ క్లబ్ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

## 41 బంతులు..111 పరుగులు

గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా శుక్రవారం ఉదయం హనుమకొండ కింగ్స్ %-% ప్రాణహిత జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రికార్డుల పంట పండింది. హనుమకొండ కింగ్స్ జట్టు ఓపెనర్‌గా బరిలో దిగిన ఆంధ్రజ్యోతి డెస్క్ ఇంచార్జి మైదం సుధాకర్ సెంచరీ కొట్టాడు. కేవలం 41 బంతుల్లోనే 111 పరుగులు సాధించాడు. దీంతో నిర్ణీత 12 ఓవర్లలో హనుమకొండ కింగ్స్ జట్టు 192 పరుగులు సాధించి విజయాన్ని సొంతం చేసుకుంది. జర్నలిస్టుల క్రీడల్లో సెంచరీ నమోదు కావడం ఇదే తొలిసారి కావడంతో పాటు 192 పరుగులు సాధించడం కూడా కొత్త రికార్డును దక్కించుకుంది. అయితే 111 పరుగులతో ప్రతిభ చూపిన మైదం సుధాకర్‌ను ప్రెస్‌క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు అభినందించారు.

## క్రికెట్ విజేతలు వీరూ..

1.యంగ్ ఎలక్ట్రానిక్స్ v/s ఈస్ట్ రాకర్స్ మధ్య జరిగిన పోరులో యంగ్ ఎలక్ట్రానిక్ టీం విజేతగా నిలిచింది.

2.హనుమకొండ కింగ్స్ v/s ప్రాణహిత టీం మధ్య జరిగిన పోరులో హనుమకొండ కింగ్స్ విజయం సాధించింది.

3.లగాన్ టీం v/s నమస్తే తెలంగాణ డెస్క్ టీం మధ్య జరిగిన పోరులో లగాన్ టీం విజయం సాధించింది.

4.సాక్షి డెస్క్ v/s వరంగల్ ఈస్ట్ డ్రాగన్స్ టీం మధ్య జరిగిన పోరులో సాక్షి డెస్క్ టీం విజయం సాధించింది.


















EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com